# ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

■ **అదనపు కలెక్టర్ సీతారామారావు**

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 30 : ఎస్సీ, ఎస్టీలపై దాడులు, దౌర్జన్యాలకు సంబంధించి తక్షణమే స్పందించి కేసు నమోదు చేసి త్వరితగతిన విచారణ జరిపినప్పుడే సరైన న్యాయం చేసినట్లని అదనపు కలెక్టర్ సీతారామారావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి త్వరితగతిన కేసును విచారణ చేసి ప్రాథమికంగా 25శాతం నష్టపరిహారం ఇప్పించాలని సూచించారు. కేసును 60 రోజుల్లోగా పరిష్కరించకపోతే బలహీనపడే అవకాశం ఉన్నదని, చార్జ్‌షీట్ దాఖలు చేసి క్లియర్‌గా ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించి వివిధ సెక్షన్ల కింద 47 రకాల కేసులు నమోదు చేసేందుకు, నష్టపరిహారం అందించేందుకు చట్టం రక్షణ కల్పించిందన్నారు. కేసు తీవ్రతను బట్టి ప్రాథమికంగా ఎఫ్ఐఆర్ నమోదుస్థాయిలో బాధితులకు 25శాతం, చార్జిషీట్ దాఖలులో 50శాతం, కోర్టు విచారణ పూర్తయిన తరువాత మరో 25శాతం నష్టపరిహారం అందిస్తుందన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించి ఇప్పటి వరకు 359 కేసులు నమోదు కాగా, అందులో 262 కేసులపై చార్జిషీట్ దాఖలు చేశామని, 338 కేసులకు సంబంధించి బాధితులకు రూ.4,48,61,250 నష్టపరిహారం మంజూరు చేసి అందజేశామన్నారు. మరో 18 కేసుల్లో బాధితుల నుంచి బ్యాంకు తదితర వివరాల సమాచారం సేకరించి వారందరికీ డబ్బులు విడుదల చేస్తామని తెలిపారు. అత్యాచార కేసులో ఉన్న ముగ్గురు బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మరో మూడు కేసులను రిజెక్ట్ చేశామని తెలిపారు. పలు కేసుల్లో పెండింగ్ ఉన్న ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆయన అదనపు ఎస్పీకి సూచించారు. ఇంటి పక్కన గొడవలు, పొలాల సమస్యలు వంటి చిన్న చిన్న కేసుల్లో సాధ్యమైనంత వరకు మనస్పర్థలకు పోకుండా పరిష్కరించే దిశగా పోలీసులు కృషి చేయాలని సూచించారు. అనంతరం అదనపు ఎస్పీ రామేశ్వర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల పరిష్కారానికి పోలీస్‌శాఖ కృషి చేస్తుందన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బాలరాజు మాట్లాడుతూ బాధ్యులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, గ్రామాల్లో పండుగల సందర్భంలో సివిల్ రైట్ డేలను నిర్వహించాలని కోరారు. అంతకుముందు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి రామ్‌లాల్ మాట్లాడుతూ జిల్లాలో 17 ఎస్సీల హత్యలు, 11 అత్యాచారాలు, ఒక గ్యాంగ్ రేప్‌లపై కేసు నమోదు అయ్యాయని సూచించారు. సమావేశంలో కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ ఆర్డీవోలు వెంకట్‌రెడ్డి, శ్రీనూనాయక్, నాగరాజులు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కమలాకర్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

**ఘనంగా పౌరహక్కుల దినోత్సవం**

కందనూలు, సెప్టెంబర్ 30 : మండలంలోని చందుబట్లలో పౌరహక్కుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కోటేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు అందరికీ సమానంగా వర్తిస్తాయన్నారు. అనంతరం ఎస్సై మహేందర్ మాట్లాడుతూ ప్రజలందరూ గ్రామంలో జరిగే జాతరలు, వేడుకలు సహపంక్తి భోజనాలు మొదలైన సాముహిక వేడుకల్లో ఎవరైనా పౌర హక్కుల చట్టాన్ని ధిక్కరిస్తే శిక్షార్హులవుతారన్నారు. సమావేశంలో తాసీల్దార్ సుదర్శన్‌రెడ్డి వార్డెన్ రామాంజనేయులు, సర్పంచ్ రమేశ్ , ఉపసర్పంచ్ ఊశన్న, ఎంపీటీసీ కవిత, ప్రజలు, అధికసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు ప్రభుత్వం పెద్దపీట



చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎంపీపీ

తెలకపల్లి, సెప్టెంబర్ 30 : మత్స్యకారులకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎంపీపీ మధు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని చెరువులో 1లక్షా 45వేల చేపపిల్లలు, దాసుపల్లి చెరువులో 84వేలు, గౌరారం చెరువులో 72వేల చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు మత్స్యకారులను ఏ మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిఒక్కరికీ అన్ని విధాలుగా చేయూతనందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణయ్య, ఎంపీటీసీలు రమేశ్, లక్ష్మమ్మ, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, శ్రీకాంత్, వెంకటేశ్, మాజీ ఎంపీపీ నర్సింహ, బాలగౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 30 : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై రమేశ్ శనివారం పేర్కొన్నారు. మండలంలో ఎల్లికట్ట నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్‌లను కల్వకుర్తి పట్టణంలో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు

## ఆర్థికసాయం అందజేత

ఊర్కొండ, సెప్టెంబర్ 30 : మండలంలోని బొమ్మరాజుపల్లిలో శనివారం అంతమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. సర్పంచ్ ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం అంత్యక్రియలకు రూ.5వేలు జిల్లా కబడ్డీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అందజేశారు.

## 3న కంటి వైద్యశిబిరం

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబర్ 30 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 3న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ అధికారి బి.శివారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి క్యాటరాక్ట్ పొర ఉన్న వారిని గుర్తించి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 944045 4284 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## ఎమ్మెల్యే సహకారంతోనే గ్రామాలాభివృద్ధి



అమీనొద్దీన్ దర్గా పనులు పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఊర్కొండ, సెప్టెంబర్ 30 : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతోనే గ్రామాలాభివృద్ధి చెందుతున్నాయని ఊర్కొండపేట సర్పంచ్ అనిత అన్నారు. శనివారం అమీనొద్దీన్ వలియా దర్గా పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో రూ.8లక్షల సీడీపీ నిధులతో దర్గా పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా రూ.15లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. కాగా రూ.16 లక్షల నిధులతో పల్లెదవాఖాన ప్రారంభానికి సిద్ధంగా వున్నదన్నారు. మనఊరు మనబడిలో భాగంగా సుమారు రూ.63లక్షల నిధులతో పనులు చివరి దశలో వున్నాయని, రూ.5 లక్షల నిధులతో యాదవకమిటీ భవన నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేసుకొని ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఊర్కొండపేటకు అన్ని విధాలుగా సహకరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

## కబడ్డీ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



అండర్-14లో ప్రతిభ చాటిన బాలుర, బాలికల జట్టు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 30 : 67వ ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీల్లో జిల్లాకు చెందిన బాలబాలికలు ప్రతిభ కనబర్చారు. వనపర్తి జిల్లాలోని పెద్దగూడెంలో శనివారం నిర్వహించిన అండర్-14 విభాగంలో కబడ్డీ పోటీల్లో బాలురు, బాలికల జట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే మొదటిస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపిక పట్ల జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు, ఎస్‌పీసీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకటయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు సామ రమేశ్, కుమారస్వామి, అలీ, మోహన్‌లాల్, లక్ష్మి, వినయ్‌కుమార్, రమేశ్, శాంతి అభినందించారు. రాష్ట్రస్థాయికి అండర్-14 వి భాగంలో జిల్లా నుంచి నందిని, మనీషా, గౌతమి, గాయిత్రి, జగన్, చందు, శివ, దామోదర్ ఎంపికైనట్లు వారు తెలిపారు.

## విత్తన ఎంపిక చాలా ముఖ్యమైనది

తాడూరు, సెప్టెంబర్ 30 : పంటలో విత్తనం ఎంపిక చాలా ముఖ్యమైనదని ఏవో రమేశ్ అన్నారు. నా సైనోర క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం అల్లాపూర్, తాడూరు గ్రామాల్లోని పొలాల్లో అధీర - 333 రైతులు క్షేత్ర పరిశీలన చేశారు. దీంతో దిగుబడిని ఇస్తూ చీడపీడలను తట్టుకొని కాయలు లావుగా ఉండి దగ్గర దగ్గర చిక్కని కాపు ఉండి దిగుబడి ఇస్తాయన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణనాథుల నిమజ్జనం



కొట్రతండాలో భక్తులకు అన్నదానం చేస్తున్న వినాయక భక్త బృందం

వెల్దండ, సెప్టెంబర్ 30 : మండలంలోని కొట్రతండాలో గణనాథులను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణనాథుడిని రథంలో పెట్టి భజన కీర్తనలతో ఊరేగింపు నిర్వహించారు. కోలాటాలు, నృత్యాలతో ఊరేగింపుగా వెళ్లి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సోమ్లా, వెంకటేశ్, సందీప్, శంకర్, షక్రు గ్రామస్తులు తదితరులున్నారు.

## విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్ఎం చంద్రుడునాయక్

వెల్దండ, సెప్టెంబర్ 30 : విద్యార్థుల సామర్థ్యాలకనుగుణంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని పెద్దాపూర్ కాంప్లెక్స్ జీహెచ్ఎం చంద్రుడునాయక్ అన్నారు. శనివారం మండలంలో పెద్దాపూర్ కాంప్లెక్స్ పరిధిలోని రాఘాయిపల్లి, చౌదర్‌పల్లి, మర్రిగుంతతండా, గొల్లోనిపల్లి, కుప్పగండ్ల పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధనాభ్యసం, అన్ని తరగతుల విద్యార్థుల ప్రగతి, ఎఫ్ఎల్ఎన్ రిపోర్ట్స్, పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో వారి సామర్థ్యాలను గుర్తించి బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ అంజ్యానాయక్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఉన్నారు.

## పాఠశాల తనిఖీ చేసిన ఎంఈవో



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈవో భాస్కర్‌రెడ్డి

బిజినపల్లి, సెప్టెంబర్ 30 : మండలంలోని కారుకొండ ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో భాస్కర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రార్థనకు హాజరై విద్యార్థుల హాజరు, ప్రగతి నమోదు రిజిస్టర్లు, రికార్డ్స్ పరిశీలించారు. విద్యార్థుల తరగతి వారీగా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని వంటవర్కర్లకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు వీరేశ్, భాగ్యలక్ష్మి, లావణ్య, కవిత, సంధ్యలు ఉన్నారు.

## విద్యాభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిది

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 30 : సర్కారు పాఠశాలల విద్యాభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిదని హెచ్ఎం రఘురామారావు అన్నారు. శనివారం మండలంలోని బెక్కర ప్రాథమిక పాఠశాలలో రాజేందర్‌రెడ్డి ఇంగ్లిష్ స్టడీ సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలని కోరారు. అనంతరం దాతకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## జలసాధన సమితి అధ్యక్షుడికి సన్మానం

చారకొండ, సెప్టెంబర్ 30 : జలసాధన సమితి అధ్యక్షుడు సత్యనారాయణను శనివారం మండల కేంద్రంలో సింగిల్ విండో చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, మర్రిపల్లి సర్పంచ్ నరేశ్‌నాయక్, యువకులు శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన పాలమూరు-నల్లగొండ జిల్లాలకు సాగు, తాగు నీరు అందించడానికి చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ప్రకృతి కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, శ్రీను, ప్రతాప్‌గౌడ్, అంజి, చరణ్, ఖలీల్, నరేశ్, రాజేశ్, సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.